క్లుప్తంగా

నేడు మండల సమాఖ్య సమావేశం

కెరమెరి: మండల కేంద్రంలోని మండల సమాఖ్య కార్యాలయంలో నేడు ఉదయం 11 గంటలకు మండల సమాఖ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఐకేపీ ఏపీఎం జగదీశ్వర్ ఒక ప్రకటనలో తెలిపారు. సమావేశానికి మండలంలోని వీవో అధ్యక్ష, కార్యదర్శులు, సీసీలు, వీవోఏలు తగు సమాచారంతో సకాలంలో హాజరు కావాలని సూచించారు.

'కాంగ్రెస్ గెలుపునకు కృషి చేయాలి'

జైనూర్: కాంగ్రెస్ పార్టీ గెలుపుకోసం ప్రతీ కార్యకర్త కృషి చేయాలని పార్టీ నియోజకవర్గ నాయకుడు గణేశ్ రాథోడ్ అన్నారు. గురువారం మండల కేంద్రంలో పార్టీ నాయకులతో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్టీకి సేవలందించిన సీనియర్లకే టికెట్ కేటాయిస్తామని పార్టీ పెద్దలు ప్రకటించడం హర్షనీయమన్నారు. పార్టీకి సంబంధించిన డిక్లరేషన్ కరపత్రాలను ప్రతీ గడపకు చేరవేయాలని సూచించారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు ఉన్నారు.

ముక్త సాళ్వే జయంతి వేడుకలకు ఆహ్వానం

ఆసిఫాబాద్‌రూరల్: ఈ నెల 29న నార్నూర్ మండలం గుడిహత్నూర్‌లో నిర్వహించే ముక్తా సాళ్వే 183వ జయంతి ఉత్సవాలకు నిర్వహణ కమిటీ సభ్యులు ఎమ్మెల్యే ఆత్రం సక్కును ఆయన క్యాంపు కార్యాలయంలో కలిసి ఆహ్వానపత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ మహాత్మా పూలే ప్రీ ప్రైమరీ పాఠశాలలో బ్రిటిష్ కాలంలో చదివిన మొట్టమొదటి దళిత మహిళ ముక్త సాళ్వే అని కొనియాడారు. దళిత మహిళలకు చదువు అవసరాన్ని తెలిపిన మహిళా జయంతి వేడుకలకు పెద్ద ఎత్తున ప్రజలు హాజరు కావాలని కోరారు. కార్యక్రమంలో నిర్వహణ కమిటీ సభ్యులు గోపాల్, సత్యపాల్, రాజు, ఏకనాథ్ తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ ఆధ్వర్యంలో బైక్ ర్యాలీ

కాగజ్‌నగర్‌టౌన్: కాగజ్‌నగర్ పట్టణంలోని సర్‌సిల్క్ కాలనీ నుంచి పటేల్ గార్డెన్స్ వరకు బీజేపీ ఆధ్వర్యంలో బైక్ ర్యాలీ నిర్వహించనున్నట్లు పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు డాక్టర్ హరీశ్‌బాబు తెలిపారు. ఉదయం 10 గంటలకు ప్రారంభమయ్యే బైక్ ర్యాలీలో పెద్ద ఎత్తున కార్యకర్తలు, అభిమానులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

దుమ్ముతో అవస్థలు

కాగజ్‌నగర్‌టౌన్: కాగజ్‌నగర్ పట్టణంలో ఎస్పీఎం పొగ గొట్టం నుంచి వెలువడుతున్న డస్ట్‌తో పట్టణవాసులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పెట్రోల్ పంపు ఏరియాలో ఇంటి బయట ఆరబెట్టిన బట్టలపై, వాహనాలపై, నీటి కుండీలలో సైతం తెల్లటి డస్ట్ పడుతుందని కాలనీవాసులు వాపోతున్నారు. ఈ డస్ట్ పీల్చుకోవడంతో అనారోగ్యం పాలయ్యే ప్రమాదం ఉందని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

పోలింగ్ కేంద్రాల్లో సౌకర్యాలు కల్పించాలి

తాండూర్: పోలింగ్ కేంద్రాల్లో ఓటర్లకు ఇబ్బందులు కలగకుండా తగిన సౌకర్యాలు కల్పించాలని ఎంపీడీవో ప్రవీణ్‌కుమార్ అన్నారు. మండలంలోని పంచాయతీ కార్యదర్శులతో గురువారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. సౌకర్యాలు కల్పించాల్సిన బాధ్యతను కార్యదర్శులు తీసుకోవాలని ఆదేశించారు. ప్రతి పోలింగ్ కేంద్రంలో తాగునీరు, విద్యుత్, మరుగుదొడ్లు ఉండేలా చూసుకోవాలని పేర్కొన్నారు. ప్రత్యేకించి ర్యాంపు ఉందా లేదో చూసుకోవాలని తెలిపారు. పోలింగ్ సిబ్బంది ఇక్కట్లు పడకుండా వ్యవహరించాలని మార్గదర్శకం చేశారు. సమావేశంలో ఎంపీవో సత్యనారాయణ, అసిస్టెంట్ ప్రోగ్రాం అధికారి నందకుమార్, పంచాయతీ కార్యదర్శులు, టీఏ, ఎఫ్ఏలు పాల్గొన్నారు.

కొనసాగుతున్న 'ఓపెన్' పరీక్షలు

మంచిర్యాలఅర్బన్: ఓపెన్ స్కూల్ ఇంటర్, పదోతరగతి పరీక్షలు గురువారం కొనసాగాయి. పదోతరగతి పరీక్షలకు 53మందికి గాను 38మంది విద్యార్థులు హాజరుకాగా 15మంది గైర్హాజరయ్యారు. ఇంటర్‌లో 32మంది విద్యార్థులకు గాను 23మంది విద్యార్థులు హాజరుకాగా 09మంది గైర్హాజరయ్యారని డీఈవో యాదయ్య తెలిపారు.

'బీఆర్‌ఎస్‌వి మోసపూరిత హామీలు'

ఎదులాపురం: బీఆర్‌ఎస్‌వి మోస పూరిత హామీలని ఐఎఫ్‌టీయూ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు గౌరాల సుభాష్, జగన్‌సింగ్ అన్నారు. జిల్లా కేంద్రంలోని కుమురం భీం భవన్‌లో గురువారం మాట్లాడారు. బీఆర్ఎస్ మెనిఫెస్టోలో అన్ని వర్గాలను విస్మరించిందన్నారు. అసంఘటిత రంగ కార్మికులు, ఉద్యోగుల గురించి ప్రస్తావన లేకుండా మెనిఫెస్టో రూపొందించారని మండిపడ్డారు. గత ఎన్నికల్లో ఇచ్చిన హామీలను ఇప్పటి వరకు అమలు చేయలేదన్నారు. సమావేశంలో నితిన్, వినోద్, సురేందర్, తదితరులు పాల్గొన్నారు.

ఎండిపోతున్న 'పత్తి'

- వర్షాలపైనే రైతన్నల ఆశలు
- విద్యుత్ కోతలతో బోర్లు ఉన్నా తిప్పలు
- ఆందోళన చెందుతున్న అన్నదాతలు


కెరమెరిలోని విద్యుత్ సబ్‌స్టేషన్


సాకడలో ముడుచుకుపోయిన పత్తి ఆకులు

కెరమెరి: మండుతున్న ఎండలతో పత్తి పంటలు దెబ్బతింటున్నాయి. వర్షాలు లేకపోవడంతో పత్తి ఆకులు ముడుచుకుపోతున్నాయి. దీంతో పంట దిగుబడులపై రైతులు పెట్టుకున్న ఆశలు సన్నగిల్లుతున్నాయి. ఈ పరిస్థితుల్లో వాన దేవుని కరుణ కోసం అన్నదాతలు నిరీక్షిస్తున్నారు. గడిచిన నెల రోజుల నుంచి వాన జాడ లేకపోవడంతో పాటు ఎండలు దంచికొడుతున్నాయి. దీంతో క్రమక్రమంగా పత్తి పంట నిర్జీవమైపోతోంది. మండలంలో మొత్తం 6434 మంది రైతులు ఉండగా 30వేల ఎకరాల్లో పంటలు సాగు చేస్తున్నారు. 22వేల ఎకరాల్లో పత్తి పంట పండిస్తున్నారు. వ్యవసాయధారిత మండలం కావడంతో రైతులు అత్యధికంగా పత్తి పంట సాగు చేశారు.

బోర్లు ఉన్నా తప్పని కష్టం

మండలంలో మొత్తం 31 గ్రామ పంచాయతీలకు కలిపి కెరమెరిలో ఒకే విద్యుత్ సబ్‌స్టేషన్ ఉంది. దీనిపై సింగిల్ ఫేజ్ కనెక్షన్లు సుమారు 4500 ఉండగా, త్రిఫేజ్ కనెక్షన్లు 500 ఉన్నాయి. కెరమెరిలో ప్రత్యేక ఫీడర్ ఉండగా, సాంగ్వి, అనార్‌పల్లికి కలిపి ఒకటి, ఝరికి ఒక ఫీడర్ ఉంది. మండలంలోని గ్రామాలు దూరంగా ఉండడంతో విద్యుత్ సరఫరాలో ఎక్కడ చిన్న ఇబ్బంది వచ్చినా ఆ ఫీడర్‌ను బ్రేక్ చేసి పనులు చేయాల్సి ఉంటుందని విద్యుత్ అధికారులు చెబుతున్నారు. ఇటీవల కాలంలో తరుచుగా ఎల్‌సీ పేరిట విద్యుత్ కోతలు విధిస్తుండడంతో వ్యవసాయానికి త్రీఫేజ్ విద్యుత్ ఎప్పుడు వస్తుందో, ఎప్పుడు పోతుందో తెలియడం లేదని స్థానికులు వాపోతున్నారు. దీంతో పంటలకు బోర్ నీరు అందించ లేకపోతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

అమలు కాని 24 గంటల విద్యుత్..

రైతులకు 24 గంటలు విద్యుత్ సరఫరా చేస్తున్నామని ప్రభుత్వం ప్రకటిస్తున్నప్పటికీ 15 గంటలు కూడా అందడం లేదని అన్నదాతలు వాపోతున్నారు. రైతులకు మాత్రం రాత్రి 9 గంటల నుంచి మరుసటి రోజు సాయంత్రం 5 గంటల వరకు త్రీఫేజ్ విద్యుత్ సరఫరా చేస్తున్నట్లు అధికారులు చెబుతున్నారు. కానీ సమయపాలన పాటించకపోవడంతో అన్నదాతలు త్రీఫేజ్ విద్యుత్ కోసం నిరీక్షించాల్సిన పరిస్థితి నెలకొంది. ఒక నిర్ణీత సమయంలో త్రీఫేజ్ కరెంట్ ఇవ్వకుండా, ఉన్నతాధికారులు సూచించిన సమయంలో క్షేత్రస్థాయి అధికారులు త్రీఫేజ్ విద్యుత్ అందజేస్తున్నారు. అయితే త్రీఫేజ్ కరెంట్ ఇచ్చే సమయాన్ని మార్చకుండా ఒక నిర్ణీత సమయాన్ని కేటాయించాలని రైతులు అధికారులను కోరుతున్నారు.

రైతులకు సమాచారం ఇవ్వాలి



గతంలో త్రీఫేజ్ విద్యుత్ సరఫరా అవుతున్నట్లు రైతుల ఫోన్లకు మెసేజ్ వచ్చేది. దీంతో ఇబ్బంది ఉండేది కాదు. కానీ ప్రస్తుతం త్రీఫేజ్ విద్యుత్‌పై రైతులకు ఎలాంటి సమాచారం ఇవ్వడం లేదు. అధికారులు కోతలు లేని కరెంటు సరఫరా చేయాలి. ఎండలతో పత్తి పంటలు మాడిపోతున్నాయి. సరైన విద్యుత్ సరఫరా చేసి పంటలను రక్షించాలి.

– దండుగల ఎల్లప్ప, రైతు, కెరమెరి

బీఆర్‌ఎస్‌తోనే సమగ్ర అభివృద్ధి


మాట్లాడుతున్న జెడ్పీ చైర్‌పర్సన్ కోవ లక్ష్మి

జైనూర్: ఆసిఫాబాద్ నియోజకవర్గ సమగ్ర అభివృద్ధికి ప్రత్యేక కృషి చేస్తానని జెడ్పీ చైర్‌పర్సన్ కోవ లక్ష్మి అన్నారు. గురువారం మండలంలోని ఆయా గ్రామాల్లో పర్యటించి అభివృద్ధి, సంక్షేమ పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఆమె మాట్లాడుతూ సీఎం కేసీఆర్ సారథ్యంలో బీఆర్ఎస్ ప్రభుత్వం గ్రామీణ ప్రాంత పేద ప్రజలకు అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తుందన్నారు. ఈసారి బీఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలోకి వస్తే రైతుబంధు రూ.16 వేలకు పెంపు, కల్యాణలక్ష్మి పథకం కింద రూ. 2 లక్షలు, అర్హత గల మహిళలకు రూ.400లకే గ్యాస్ సిలిండర్ ఇస్తామన్నారు. ప్రతీ కుటుంబానికి రేషన్ ద్వారా సన్న బియ్యం అందజేస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ కనక యాదవరావు, వైస్ ఎంపీపీ చిర్లే లక్ష్మణ్, ఎంపీటీసీల ఫోరం అధ్యక్షుడు భగవంత్‌రావు, సర్పంచుల సంఘం అధ్యక్షుడు భీంరావు, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు ఇంతియాజ్ లాలా, స్థానిక ఎంపీటీసీ జుగాదిరావు, సర్పంచులు, బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కార్యకర్తలు సమయపాలన పాటించాలి


గ్రామస్తులతో మాట్లాడుతున్న సీడీపీవో

దహెగాం: అంగన్‌వాడీ కేంద్రాల్లో అంగన్‌వాడీ కార్యకర్తలు సమయపాలన పాటించాలని ఐసీడీఎస్ సీడీపీవో సురేఖ అన్నారు. మండలంలోని పీపీ రావు కాలనీకి చెందిన అంగన్‌వాడీ కార్యకర్తపై ఫిర్యాదు రావడంతో గురువారం సీడీపీవో గ్రామానికి వెళ్లి విచారణ చేపట్టారు. విధులపై నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అంగన్‌వాడీ కేంద్రాలకు వచ్చే చిన్నారులకు పౌష్టికాహారం అందించాలని సూచించారు. ఆమె వెంట పీపీరావు, కాలనీ సర్పంచ్ శంకర్, గ్రామస్తులు ఉన్నారు.

తహసీల్దార్‌కు సన్మానం


సమీర్‌ను సన్మానిస్తున్న రేషన్ డీలర్లు

రెబ్బెన: మండల నూతన తహసీల్దార్‌గా ఇటీవల బాధ్యతలు స్వీకరించిన సమీర్‌ను గురువారం మండలంలోని రేషన్ డీలర్లు శాలువాలతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ మండలంలో రేషన్ బియ్యం పంపిణీ సక్రమంగా చేపట్టాలని, కార్డుదారులకు తప్పనిసరిగా రేషన్ బియ్యం అందేలా చూడాలని పేర్కొన్నారు. క్రమం తప్పకుండా షాపులను తెరవాలని సూచించారు. కార్యక్రమంలో డీలర్లు మురళీ, శ్రీపతి, ప్రభాకర్, సంతోష్, బాపు, జానకీరాం తదితరులు పాల్గొన్నారు.

బీజేపీలో భారీగా చేరికలు


బీజేపీలో చేరుతున్న కోత్మీర్ గ్రామస్తులు

దహెగాం: మండలంలోని కోత్మీర్, జెండాగూడ గ్రామాలకు చెందిన పలువురు బీఆర్ఎస్ కార్యకర్తలు గురువారం బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పాల్వాయి హరీశ్‌బాబు సమక్షంలో బీజేపీలో చేరారు. కోత్మీర్ మాజీ సర్పంచ్ నాయికిని మల్లేశ్, సీనియర్ నాయకుడు నాయికిని సత్యనారాయణల ఆధ్వర్యంలో బీఆర్ఎస్ పార్టీ నుంచి కోత్మీర్, జెండాగూడ గ్రామాలకు చెందిన సుమారు 200 మంది బీజేపీలో చేరడంతో వారికి కండువాలు కప్పి హరీశ్‌బాబు పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు రాపర్తి ధనుంజయ్, నాయకులు ఎల్కరి దామోదర్, ప్రభాకర్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.


జిల్లా కేంద్రంలోని రావులవాడలో పేరుకుపోయిన చెత్త


జిల్లా కేంద్రంలోని శివకేశవ మందిర్ సమీపంలో రోడ్డుపై చెత్త

ఎక్కడి చెత్త అక్కడే..!

ఆసిఫాబాద్: జిల్లా కేంద్రంలోని పలు కాలనీల్లో చెత్తాచెదారం రోడ్లపై దర్శనమిస్తోంది. దీంతో రహదారిపై చెత్తాచెదారం పేరుకుపోయి దుర్గంధం వెదజల్లుతోంది. ప్రతీరోజు చెత్త తొలగించాల్సి ఉన్నా అధికారుల నిర్లక్ష్యం కారణంగా కుప్పలుకుప్పలుగా చెత్త పేరుకుపోతోంది. సంబంధిత అధికారులు తగు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

బీఆర్‌ఎస్‌లో పలువురి చేరిక


పార్టీలో చేరిన వారితో ఎమ్మెల్యే కోనేరు కోనప్ప


బీఆర్ఎస్‌లో చేరుతున్న యువకులు

కాగజ్‌నగర్‌టౌన్: కాగజ్‌నగర్ పట్టణంలోని సిర్పూర్ ఎమ్మెల్యే కోనేరు కోనప్ప నివాసంలో గురువారం నియోజకవర్గంలోని ఆయా మండలాలు, గ్రామాల నుంచి భారీగా చేరికలు జరిగాయి. ఎమ్మెల్యే కోనేరు కోనప్ప సమక్షంలో వివిధ పార్టీల నాయకులు, ప్రజలు బీఆర్ఎస్ పార్టీ తీర్థం పుచ్చుకున్నారు. వారికి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. బెజ్జూర్ మండలం అందుగుల గ్రామానికి చెందిన యువకులు, ముంజంపల్లి గ్రామానికి చెందిన మహిళలు, సలుగుపల్లి (ఊట్ సారంగపల్లి) గ్రామస్తులు, దహెగాం మండలం దిగడ గ్రామానికి చెందిన బీజేపీ నాయకులు, చింతలమానెపల్లి మండలం గంగాపూర్ గ్రామానికి చెందిన వివిధ పార్టీల నాయకులు తదితరులు బీఆర్ఎస్ పార్టీలో చేరారు.

కాగజ్‌నగర్‌రూరల్: మండలంలోని చింతగూడ గ్రామం ఎఫ్‌క్వార్టర్, సారసాల గ్రామానికి చెందిన యువకులు గురువారం జెడ్పీ వైస్‌చైర్మన్ కోనేరు కృష్ణారావు సమక్షంలో బీఆర్ఎస్ పార్టీలో చేరారు. బీఆర్ఎస్ పార్టీ పట్ల ఆకర్శితులై బీజేపీ, బీఎస్పీల నుంచి బీఆర్ఎస్ పార్టీలో యువకులు చేరుతున్నట్లు ఆయన తెలిపారు. కండువా కప్పి యువకులను పార్టీలోకి ఆహ్వానించారు.

భక్తిశ్రద్ధలతో దుర్గాదేవికి ప్రత్యేక పూజలు


రెబ్బెన: ఇందిరానగర్ ఆలయంలో మొక్కులు తీర్చుకుంటున్న భక్తులు


రెబ్బెన: లలిత త్రిపుర సుందరీ దేవిగా దర్శనమిస్తున్న దుర్గామాత

రెబ్బెన: దేవీ నవరాత్రి ఉత్సవాల సందర్భంగా గ్రామాల్లో ప్రతిష్ఠించిన దుర్గామాత విగ్రహాలకు భక్తులు ప్రత్యేక పూజలు చేస్తున్నారు. నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ఐదవ రోజు దుర్గామాత లలిత త్రిపుర సుందరీ దేవి అవతారంలో భక్తులకు దర్శనమిచ్చింది. గోలేటి, గంగాపూర్ గ్రామాల్లో ప్రతిష్ఠించిన దుర్గామాత విగ్రహాలతో పాటు గోలేటి సీహెచ్‌పీలోని దుర్గామాత ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. గోలేటి సీహెచ్‌పీలో మహిళలు కుంకుమ పూజలు నిర్వహించారు. అనంతరం సీహెచ్‌పీ డీజీఎం భీం రావ్ జాడే దంపతులను ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. ఇందిరానగర్‌లోని కనకదుర్గాదేవి, స్వయంభూ మహంకాళి అమ్మవారి ఆలయంలో దేవీ నవరాత్రి ఉత్సవాలు ఘనంగా కొనసాగుతున్నాయి. 5వ రోజు కనకదుర్గాదేవి లలిత త్రిపుర సుందరీ దేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. అమ్మవారిని దర్శించుకునేందుకు వచ్చే భక్తులతో ఆలయం కిటకిటలాడుతోంది. మండలంలోని భక్తులతో పాటు చుట్టు పక్కల మండలాల నుంచి తరలివస్తున్న భక్తులు అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేస్తూ ఓడిబియ్యం, పట్టువస్త్రాలు, నైవేద్యాలు సమర్పిస్తూ మొక్కులు తీర్చుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు.

కెరమెరిలో..

కెరమెరి: మండల కేంద్రంలోని విద్యానగర్ దుర్గాదేవి మండపం వద్ద గురువారం మహిళలు భక్తిశ్రద్ధలతో కుంకుమపూజ నిర్వహించారు. కళశపూజ, గణపతిపూజ, అంగపూజ, గౌరీ పూజ, కుంకుమ పూజలు చేశారు. అనంతరం మంగళహారతులిచ్చారు. తీర్థప్రసాదాలు ఇచ్చి పుచ్చుకున్నారు.

స్కందమాతగా అవతారం..

నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా మండలంలోని మండపాల్లో దుర్గామాత ఐదవ రోజు స్కందమాతగా దర్శనమిచ్చింది. స్కందమాతను సరస్వతి మాతగా కూడా పిలుస్తారు. ఈరోజు కొన్ని చోట్ల అక్షరాభ్యాసం చేయించారు. చిన్నా, పెద్దా తారతమ్యం లేకుండా మండపాల్లో ప్రత్యేక గీతాలాపన చేస్తున్నారు.


ఆసిఫాబాద్: శారదా మండలి వద్ద..

బీబ్రాలో బ్రహ్మోత్సవాలు

దహెగాం: మండలంలోని బీబ్రా గ్రామంలో గల వేంకటేశ్వర స్వామి ఆలయంలో బ్రహ్మోత్సవాలు కొనసాగుతున్నాయి. వేదపండితుడు పరమేశ్వర్ ఆధ్వర్యంలో వేంకటేశ్వర స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామివారి ఊరేగింపు నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో భక్తులు పాల్గొన్నారు.

ఆసిఫాబాద్: జిల్లా కేంద్రంలో శరన్నవరాత్రి వేడుకలు భక్తిశ్రద్ధలతో జరుపుకుంటున్నారు. పట్టణంలోని వివిధ ఆలయాలు, కాలనీల్లో ఏర్పాటు చేసిన దుర్గ, శారదామాత మండపాల వద్ద మహిళలు సామూహిక కుంకుమ పూజలు నిర్వహించారు. పట్టణంలోని బాపూనగర్ శారదామాత మండపం వద్ద సామూహిక లలితా పారాయణం చేశారు. పైకాజీనగర్‌లో మహిళలు సామూహిక కుంకుమ పూజలు నిర్వహించారు. రావులవాడలోని శారదా మండలి వద్ద అన్నదానం చేపట్టారు. పట్టణంలోని కేశవనాథ ఆలయంలో శరన్నవరాత్రి ఉత్సవాలు భక్తిశ్రద్ధలతో జరుపుకుంటున్నారు.

ఆకట్టుకున్న సంప్రదాయ నృత్యాలు

ఆసిఫాబాద్‌అర్బన్: దుర్గాదేవి నవరాత్రుల్లో భాగంగా గురువారం జిల్లా కేంద్రంలోని గాంధీచౌక్ వాణిజ్య దుర్గామాత మండపం వద్ద ఉత్తరాదికి చెందిన మహిళలు సంప్రదాయబద్ధంగా చేసిన నృత్యాలు ఆకట్టుకున్నాయి. దుర్గామాతకు పూజలు చేసిన అనంతరం రాజస్థానీల సంప్రదాయ నృత్యాలు చేశారు.


కెరమెరి: శివాలయంలో దుర్గామాతకు పూజలు


ఆసిఫాబాద్‌అర్బన్: నృత్యం చేస్తున్న మహిళలు


దహెగాం: పూజలో పాల్గొన్న మహిళలు


రెబ్బెన: గోలేటి సీహెచ్‌పీలో..


కెరమెరి: కుంకుమ పూజలో పాల్గొన్న మహిళలు


ఆసిఫాబాద్: పైకాజీనగర్‌లో..

గంగదేవి వారోత్సవాలు ప్రారంభం

మేమనపల్లి: మండల కేంద్రంలోని బెస్తవాడలో జాలర్ల కుటుంబాల ఆధ్వర్యంలో గంగదేవి వారోత్సవాలను ప్రారంభించారు. అర్చకుడు సుధీర్‌కుమార్ ఆధ్వర్యంలో గురువారం గంగదేవి విగ్రహాన్ని గ్రామంలో డీజే చప్పుళ్లు, మంగళహారతులతో శోభాయాత్ర నిర్వహించి విగ్రహాన్ని ప్రతిష్ఠించారు. వారం రోజులు చేపలవేటకు వెళ్లకుండా నియమనిష్ఠలతో నవరాత్రులు జరుపుకోనున్నట్లు తెలిపారు. పూజలు, గంగాదేవి ఒగ్గుకథ గానం ఉంటుందన్నారు.

'సంక్షేమ పథకాలే గెలిపిస్తాయి'

బజార్‌హత్నూర్: సంక్షేమ పథకాలే బీఆర్‌ఎస్‌ను గెలిపిస్తాయని ఆదిలాబాద్ మాజీ ఎంపీ గోడం నగేశ్ అన్నారు. గురువారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన బీఆర్ఎస్ కార్యకర్తల ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొన్నారు. బోథ్ బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి అనిల్ జాదవ్ మాట్లాడుతూ.. ఈ ఎన్నికల్లో ప్రజలు ఆశీర్వదిస్తే బోథ్ నియోజకవర్గాన్ని మరింత అభివృద్ధి చేస్తానన్నారు. ప్యాక్స్ చైర్మన్ మేకల వెంకన్న, ఎంపీపీలు తుల శ్రీనివాస్, సజన్, తాంసి జెడ్పీటీసీ తాటిపెల్లి రాజు, మార్కెట్ కమిటీ చైర్మన్ రుక్మాన్‌సింగ్ పాల్గొన్నారు.

ముమ్మరంగా వాహనాల తనిఖీ


కల్వాడ వద్ద వాహనాలు తనిఖీ చేస్తున్న పోలీసులు

దహెగాం: ఎన్నికల్లో మద్యం, డబ్బు పంచకుండా అరికట్టేందుకు జిల్లా పోలీసులు పటిష్టమైన చర్యలు తీసుకుంటున్నారు. ఇందులో భాగంగా జిల్లా సరిహద్దుల వద్ద చెక్ పోస్టులు ఏర్పాటు చేశారు. గురువారం వాహనాల తనిఖీలు చేపట్టారు. సరైన పత్రాలు లేకుండా రూ.50 వేలకు మించి నగదు తరలిస్తే సీజ్ చేస్తామని హెచ్చరించారు.